
ఆంధ్రభూమి వారపత్రిక పెద్దకథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి పొందిన కథ


# కోనసీమ పరిగెడుతుంది

**కట్టా రాంబాబు**



కోనసీమ చాలా వేగంగా పరిగెడుతుంది.

ఆశ్చర్యంగా వుంది కదూ... కోనసీమ పరిగెట్టడమేమిటని, అవును. నిజంగానే పరిగెడుతుంది. అగ్రికల్చర్ నుంచి ఆక్వా కల్చర్ వైపు పరుగులు తీస్తుంది.



ఎక్కడ చూసినా పచ్చని పొలాలతో కన్పించే కోనసీమ ఇప్పుడు రొయ్యల చెరువులతో మశూచి వచ్చినవాడి ముఖంలా తయారైంది. సన్నకారు రైతునుంచి మోతుబరి రైతువరకు వేలం వె(ర్రిలా తమకున్న బంగారంలాంటి మాగాణి భూముల్ని చెరువుల రూపంలో మార్చేస్తున్నారు.

లక్షలకు లక్షలు ఆదాయాలు సంపాదించొచ్చనే ఆశే అలా మారిపోవడానికి కారణం. సంవత్సరానికి మూడుసార్లు ఫలసాయం రావడంతో అన్ని ఖర్చులు పోను ఎకరానికి మూడు ఏభైలు అంటే లక్షా ఏభై వేల రూపాయలు రావడంతో అంతా ఇందులో దిగిపోయారు. ఎందులోను లేని ఆదాయాలు రావడంతో పెద్ద పెద్ద ఉద్యోగస్తులు తమ ఉద్యోగాలకు శెలవు పెట్టి తమ ఊళ్లో వున్న స్వంత భూముల్ని చెరువుల కింద మార్చేశారు. నన్నుకూడా ఉద్యోగానికి సెలవు పెట్టి వచ్చేయమన్నారు నా మి(త్రులు.

''ఎంత కష్టపడితేమా(త్రం నెలకు మూడు నాలుగు వేలకన్నా ఎక్కువ సంపాదించలేవుకదా. హాయిగా ఒక సంవత్సరంపాటు శెలవుపెట్టుకుని ఇందులోకి దిగితే నువ్వు రిటైరయ్యేవరకు సంపాదించని మొత్తాన్ని నాలుగైదు ఎకరాలు చేసుకుంటే సంపాదించుకుంటావు'' అన్నారు. ఎందుకో నాకు మనస్కరించలేదు. అదే విషయం చెప్పాను. అయినా నాకు సెంటు భూమిలేదు. ఎలా చేయగలను?

''నీకు భూమి లేకపోతేనేం లీజుకు తీసుకో. ఎకరానికి పాతిక వేలుందనుకో. పదెకరాలకు లీజు, ఇతర ఖర్చులు పోను పదులక్షలు మిగులుతాయి''

లక్షల మొత్తం ఆశ కలిగించేలా వున్నా ధైర్యం సరిపోలేదు. చేసేది చిన్న స్కూల్లో మాస్టరీ ఉద్యోగం. అదీ వున్న ఊళ్లోనే. ఏవేవో పాత భావాలున్నవాణ్ణి కావడంతో ఉద్యోగ ధర్మాన్ని విడిచిపెట్టి పక్కదార్లో సంపాదించడం ఇష్టం లేకపోయింది. ఎవరెన్ని చెప్పినా నవ్వి ఊరుకునేవాణ్ణి. మా వూళ్లో అందరూ ఇందులో మునిగిపోయారు.


మాది కోనసీమలోని అమలాపురం దగ్గర ఓ (గ్రామం. మా ఊరి మోతుబరి రైతులంతా బాగా సంపాదించి ఆస్తులు కూడబెట్టినవాళ్లే. అయినా ఇంకా ఆశే. కోట్లు సంపాదించి బాగా ధనవంతులవ్వాలని పోటీలు పడుతున్నారు. మా జగన్నాథం మావకి పదెకరాల మాగాణి, నాలుగెకరాల కొబ్బరి తోట వున్నాయి. నలుగురు కొడుకులు, నలుగురు కూతుళ్లు. ఇద్దరు కూతుళ్లకు పెద్ద పెద్ద కట్నాలిచ్చి మంచి సంబంధాలే చేశాడు. దాంతో ఆర్థికంగా దెబ్బతిన్నాడు. ఇద్దరు కొడుకులు చిన్నవాళ్లు. పెద్దవాళ్లిద్దరికి చదువులబ్బక ఖాళీగా వున్నారు. ఇంకా ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు చేయాలి. ఆ ఇద్దరు కూతుళ్లలో ఒకమ్మాయితో నా పెళ్లి చేయాలని మా అమ్మకుండేది కాని మా మావకి మా(త్రం లేదు. ఆతని దృష్టిలో నేనో చిన్న ఉద్యోగస్తుణ్ణి. అందుకే నాకు తగిన అమ్మాయిని పెళ్లిచేసుకుని హాయిగా వున్నాను. నాకు ఇతర(త్రా సంపాదించాలనే ఆశలేదు. కాని మా జగన్నాథం మావకి మా(త్రం తన ఆర్థిక ఇబ్బందులనుంచి

బయట పడాలని, బాగా సంపాదించాలని తపనగా వుండేది. అటువంటి సమయంలో వచ్చిపడిందీ రొయ్యల వ్యాపారం. మామూలుగా కేజీ పదిహేను రూపాయలుంటే ఒక్కసారిగా ఫారిన్ ఎక్స్‌పోర్ట్ ఏర్పడడంతో కేజీ నాలుగొందలనుంచి ఐదొందలు పెరిగే సరికి అందరి కళ్లూ దానిమీదే పడ్డాయి.

ఇంకేం మా జగన్నాథం మావకి కూడా ఇందులోదిగాలనే బుద్ధి పుట్టింది. అయితే డబ్బులేక కొంత, అనుభవం లేక కొంత మొదటి సంవత్సరం మామూలుగానే వున్నాడు. కాని ఆ సంవత్సరం మొదలుపెట్టినవాళ్ల బాగా సంపాదించడంతో ఇంక ఆగలేకపోయాడు. ఆ ప్రయత్నాలు మొదలుపెట్టే సమయంలో అన్నాను.

"మావా! కొంచెం ఆలోచించి దిగడం మంచిదేమో. నీవా బంగారంలాంటి భూములు. చెరువులు పంటకు పనికిరాని భూముల్లో తవ్వాలి. ఈ రొయ్యల మార్కెట్ ఎంతకాలం వుంటుందో తెలీదు. ఒకసారి తవ్వింతర్వాత అవి పంటకు పనికిరావుకదా" అన్నాను.

నన్ను పిచ్చవాణ్ణి చూసినట్టు చూసి నవ్వి అన్నాడు. "ఎంత అమయాకుడివిరా. లక్షలకు లక్షలు వచ్చి పడుతుంటే ఎవరైనా వదులుకుంటారా రెండు మూడేళ్లు కష్టపడి చెరువులు బాగా చేసుకుంటే ఆ తర్వాత మనకాభూములు పండకపోతేనేం, పనికిరాకపోతేనేం. మన జీవితకాలంలో సంపాదించలేని మొత్తాన్ని పదెకరాల్లో సంపాదించవచ్చు. మన రామరాజుగారు చూడు ఎంత సంపాదించాడో. నలభై ఎకరాలు చేసి అరవై లక్షలు సంపాదించాడు. ఇరవై లక్షలు ఖర్చులుపోయినా నలభై లక్షలు సంవత్సరానికి సంపాదించాడు. నాలుగేళ్లు అలా వస్తే కోట్లు సంపాదిస్తాడు. ఆ తర్వాత రొయ్యలకు డిమాండ్ లేకపోతేనేం. ఆ భూములు పండకపోతేనేం" అన్నాడు.



నిజమే. మొదట్లో మా వూళ్లో రామరాజుగారే ఈ చెరువులు తవ్వించింది. ఆయన మొదలుపెడుతున్నప్పుడు అంతా వాలా అన్నవారే. కానీ ఆయన ఎవరిమాటా లెక్కచేయక వలభై ఎకరాల్లోనూ చెరువులు తవ్వించాడు. ఆ భూమంతా కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ల పేర్లమీద వుండడంతో కోపరేటివ్ బ్యాంక్ ఒక ఎకరానికి పాతికవేలవరకు అప్పులిచ్చింది. వాటితో చెరువులు తవ్వించేశాడు. ఎకరం చెరువు తవ్వడానికి పదివేలవరకు ఖర్చవుతుంది. అందులో రొయ్యల పీడ్ వెయ్యడానికి పదివేలవరకు అవుతుంది. వాటి ఫీడ్‌కయ్యే ఖర్చు వాటిని సప్లయ్ చేసే కంపెనీలవాళ్లు రెండు రూపాయలు వడ్డీ చెల్లించే పద్ధతిలో అప్పులిచ్చారు. అలా ఆయన వలభై ఎకరాలు చేస్తే నిజంగా అరవై లక్షలొచ్చింది. మొత్తం ఖర్చుపోగా ఆయనకు మా మావ చెప్పినట్లు వలభై లక్షలు మిగిలాయి. అంతే! మా వూరంతా హోరెత్తిపోయింది. చిన్నా, పెద్దా అంతా ఇందులో దిగిపోయారు.

○ ● ○

మా జగన్నాథం మావ క్షణం తీరిక లేకుండా చెరువులు తవ్వించడంలో మునిగిపోయాడు. పెద్దకొడుకులిద్దరూ తండ్రికి సహాయపడుతున్నారు. అందరూ ఒకేసారి చెరువులు తవ్వించడంతో కూలీలు దొరకడంలేదు. కూలీ రేట్లుకూడా పెరిగిపోయాయి. ఎవరికి వారే రేట్లు పెంచేసి తమ పనులు పూర్తిచేసుకుంటున్నారు. మా మావ కూడా అలాగే పూర్తిచేయించాడు. పదెకరాలు తవ్వించేసరికి లక్ష రూపాయలు పైనే అయింది. కోపరేటివ్ లోనుకోసం ప్రయత్నించాడుగానీ బ్యాంకు ప్రెసిడెంట్ వీర్రాజుకి, మా మావకి రాజకీయంగా పడకపోవడంతో ఆ లోను రాలేదు. తను ప్రెసిడెంటుగా పోటీ చేసినప్పుడు ఎదుటి పక్షంవైపు పనిచేశాడనే కోపంతో వీర్రాజు ఆ లోను రాకుండా చేశాడు. దాంతో బయట అప్పు చేయవలసి వచ్చింది. తవ్వించడానికే అప్పు చేయవలసి వస్తే తర్వాత పెట్టుబడి ఎలాగా అని ఆలోచనలో పడ్డాడు. మిగతాదికూడా బయటే తీసుకుందామా అంటే వడ్డీ రేటు మూడు రూపాయలనుంచి ఐదు రూపాయలవరకు వుంది.

మామూలు రోజుల్లో అయితే వడ్డీ రూపాయిన్నర అంటే ఎవరూ తీసుకునేవారుకాదు. ఈ చెరువుల తవ్వకం ప్రారంభమయ్యాక ప్రతివాడికి డబ్బు అవసరం ఏర్పడడంతో వడ్డీ రేటుకూడా పెరిగి పోయింది. ఇప్పుడు తీసుకున్న లక్షరూపాయలకే నెలకు నాలుగు వేలు వడ్డీ చెల్లించవలసి వస్తుంది.

పదెకరాల్లో రొయ్య పిల్లలు వేయాలంటే ఎకరానికి పదిహేను వేలు వెయ్యాలి. అంటే మొత్తం లక్షా ఏభైవేల సీడు పడుతుంది. ప్రస్తుతం ఒక్క రొయ్య పిల్ల ఖరీదు రెండు రూపాయలు పైనే వుంది. అంటే మూడులక్షల రూపాయలు పైనే కావాలి. పదెకరాలకు నీటికోసం రెండు బోర్లు కొట్టించి ఇంజన్లు పెట్టడానికి మరో ఏభై వేలు కావాలి. చెరువుల దగ్గర కాపలాగా రెండు కుటుంబాలను వుంచాలి. ఒక్కో కుటుంబానికి నెలకు వెయ్యి రూపాయలు జీతం ఇవ్వాలి. చేతిలో కేషంటూ ఏమీ లేదు. మొత్తం అప్పు

చేయాలంటే వడ్డీకే నెలకు ఇరవై వేలవరకు అవుతుంది. అంత మొత్తం అప్పు తెస్తే చివరకు మిగిలేదేమీ వుండదు. అంతా వడ్డీలకే సరిపోతుంది. అటువంటప్పుడు ఏం చెయ్యాలా అని ఆలోచనలో పడ్డాడు మా జగన్నాథం మావ.

○ ● ○

మా జగన్నాథం మావ తీసుకున్న నిర్ణయం తెలిసిన నాకు చాలా భయం వేసింది. ఇదేంటి ఇలా చేస్తున్నాడు?

వెళ్లి వెంటనే అడిగాను.

“కొబ్బరి తోట బేరం పెట్టావట నిజమేనా మావా” అని.

“నిజమేరా. నాలుగెకరాలూ అమ్మేద్దామనుకుంటున్నాను. పెట్టుబడికి కావాలిగా” అన్నాడు తాపీగా. భూమి అమ్ముతున్నానన్న బాధ ఏ కోశానా లేదు.

“బంగారం లాంటి తోట అమ్మేస్తే మళ్లీ కావాలంటే అటువంటి తోట దొరుకుతుందా” అనడిగాను.

“పోనీరా వెధవతోట. అలాంటిది కాకపోతే దాని బాబులాంటిది కొనొచ్చు. ప్రస్తుతం డబ్బు నాలుగైదు లక్షలు కావాలి. నాలుగెకరాలు అమ్మితే ఎనిమిది లక్షలకు తక్కువ రాదు. పెట్టుబడికి ఇబ్బంది వుండదు. పదెకరాల చెరువుల్లో ఎలా లెక్క వేసుకున్నా ట్రిప్పుకి పది లక్షలు చొప్పున సంవత్సరానికి ముప్ఫయి లక్షలొస్తాయి. ఇలాంటి తోటలు సంవత్సరానికి పదెకరాలు కొనొచ్చు” అన్నాడు చుట్ట పీలుస్తూ ఎంతో ధీమాగా.

“అయినా తోట అమ్మకుండా ఐదెకరాలు లీజుకిచ్చావనుకో. లక్షా ఏభై వేలవరకు లీజు వస్తుంది. ఆ మొత్తం మిగిలిన ఐదెకరాల్లోనూ పెట్టుబడికి సరిపోతుంది. అప్పుడు తోట అమ్మవలసిన పనుండదు. వచ్చే లాభంతో రాబోయే సంవత్సరంలో పదెకరాలు చేసుకో” అని సలహా ఇచ్చాను.

అయినా వినలేదు. నాలుగెకరాల కొబ్బరి

## ఘోరం

“సార్ చాలా ఘోరం జరిగిపోయింది” ఆత్రుతగా వచ్చిన పోలీస్ చెప్పాడు ఎస్.ఐ.తో.

“ఏమిటీ?” అన్నాడు ఎస్.ఐ. చిరాకుగా.

“ఆ గజ దొంగని మనవాళ్లు పట్టుకున్నారు సార్”

— గీతా శ్రీనివాస్ (గండిపాలెం)



తోట బేరం పెట్టేశాడు. మొదట్లో కొనేవా ళ్లెవరూ ముందుకు రాలేదు. మామూలుగా అయితే అంత మంచి తోటను ఎంత రేటుకైనా ఎగరేసుకుపోయేవారు. కానీ అంతా చెరువులమీద పెట్టడంతో ఎవరి దగ్గరా డబ్బు లేదు. చివరకు ఎకరం లక్షన్నరకు మధ్యవర్తులద్వారా వీర్రాజే కొన్నాడు. అతని కమ్మడం ఇష్టంలేకపోయినా తప్పలేదు.

డబ్బు చేతికందడంతో మా జగన్నాథం మావ స్పీడుగా పనులు మొదలుపెట్టాడు. బోర్లు కొట్టడం పూర్తయింది. నీరు బాగానే పడింది. ఇంజన్లుకూడా కొన్నాడు.

చెరువుల్లో రొయ్యపిల్లలు వెయ్యడానికింకా ఇరవై రోజుల టైముంది. ఈ లోగా సీడు సప్లయి చేసే షాపువాళ్లతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. పదెకరాలకు సరిపోయే సీడు అరువుగా సప్లయి చేయడానికి, అమ్మగా వచ్చిన డబ్బుతో వడ్డీ రెండు రూపాయల చొప్పున అసలు, వడ్డీ కలిపి చెల్లించడానికి మాట్లాడుకున్నాడు. ఆ సమస్యకూడా తీరిపోయింది.

ఇక రొయ్యపిల్లల గురించే ప్రయత్నించాలి.

సముద్రంలో రొయ్యసీడు పుడుతుంది. అది గోదావర్లోకూడా దొరుకుతుంది. అలా దొరికే సీడుని రెడ్‌సీడు అంటారు. అది డైరెక్టుగా చెరువుల్లో వేయడానికి పనికిరాదు. దానిని ముందుగా చిన్న చిన్న సీడ్ టాంకుల్లో వేసి పది పదిహేను రోజులు పెంచితే అది బ్లాక్‌గా మారుతుంది. బ్లాక్‌సీడ్‌నే చెరువుల్లో వెయ్యాలి. అందుకని చెరువులు తవ్వుకోలేని వారు గోదావరి పక్కన సీడ్ టాంకులు తవ్వుకుని సీడు పెంచుతుంటారు. రెడ్‌సీడు రూపాయకు దొరుకుతుంది. దాన్ని పదిరోజులు పెంచితే రెండు రూపాయలనుంచి రెండున్నరవరకు వస్తుంది. రూపాయికి రూపాయి లాభం వస్తుంది. మావూళ్లో సీడ్ టాంకులవాళ్లు బాగానే సంపాదించారు.

మా వూరికి సముద్రం నాలుగైదు మైళ్ల దూరంలో వుంది. సీడ్ పట్టుకున్న జాలర్లు టాంకులవాళ్లకు సప్లయి చేస్తుంటారు. సీడ్ టాంకుల్లో పెరిగిన పిల్లల్ని పెద్ద చెరువులవాళ్లు కొనుక్కుపోతుంటారు.

తన చెరువులకు కావలసిన రొయ్య పిల్లలు లక్షా ఏభై వేలకు మూడు లక్షలవుతుంది కాబట్టి సీడ్ టాంకుల్లో సీడ్ పెంచుకుంటే లక్షా ఏభై వేలతోనే అయిపోతుందికదాని గోదావరి వద్దున స్థలాల్లో నాలుగు టాంకులు తవ్వించాడు. ఈ టాంకులకు ఉప్పునీరుండాలి. కాబట్టే ఇవి గోదావరి ప్రక్కనే వుండాలి. వాటిని కొడుకులిద్దరూ చూసుకుంటున్నారు.

మా వూరి ఏటిగట్టుకు కొంచెం దూరంలో గోదావరి ప్రవహిస్తూ వుంటుంది. ఏటి గట్టుకి గోదావరికి మధ్యన కొబ్బరి తోటలున్నాయి. ఆ తోటల పక్కనే ఒడ్డున చిన్న చిన్న టాంకులు తవ్వుకుంటారు ఆ తోటలు కలవాళ్లు. ఇలాంటి టాంకులు మా వూళ్లో ఐదారు వందల వరకు వున్నాయి. అన్ని టాంకులవాళ్లకు ఒకేసారి సీడు అవసరమవడంతో పట్టుకునేవాళ్లు దాని రేటు పెంచేశారు. ప్రారంభంలో ఈ సీడు ధర పది, ఇరవై పైసలు మాత్రమే వుండేది.

వారికి డిమాండ్ పెరగడంతో అర్ధరూపాయి, రూపాయి అలా అలా పెరిగిపోయింది.

మా మావ బాంబులకు రూపాయి పైనే పెడితేగాని సీడు దొరికేటట్లు లేదు. ఇంతలో ఎవరో సలహా ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లాలో పలాసలోగాని, ఒరిస్సాలోని బరంపురంలోగాని కొనుక్కుంటే అరవై లేదా డెబ్బై పైసలకే దొరుకుతుందని ఖర్చులతో సహా ముప్పావలా పడుతుందని. అక్కడినుంచి తెచ్చుకుంటే లాభసాటిగా వుంటుందని చాలామంది అలాగే తెచ్చుకుంటున్నారని చెప్పడంతో అదే మంచి పద్ధతనుకున్నాడు.

తనకున్న ఒక్కో బాంబులో ఏభై వేల సీడు పడుతుంది. నాలుగు బాంబుల్లోకి రెండు లక్షల సీడు తెచ్చుకుంటే లక్షా ఏభై వేలు అవుతుంది. తన చెరువులకు కావలసిన సీడు పోగా ఇంకా ఏభైవేల సీడు మిగులుతుంది. దాన్నమ్ముకుంటే లక్ష రూపాయలకే వచ్చినట్లు అవుతుంది. ప్రారంభమే లాభంతో ప్రారంభమవుతుంది. లోకల్‌గా దొరికే సీడుకి ఎక్కువపెట్టి కొనేకంటే అక్కడనుంచి తేవడానికే నిశ్చయించుకున్నాడు. అప్పటికీ చెప్పిచూశాను. అంతదూరం ఎందుకు? అక్కడేమున్నా మోసం జరుగుతుందేమోనని. నా మాట వినలేదు. శ్రీకాకుళం బయలుదేరాడు. నన్ను తోడుగా రమ్మన్నాడు. వేసవి శలవులు ఇవ్వడంతో ఖాళీగానే వున్నానుకదా మా మావకి సహాయం చేసినట్లుంటుందని నేనూ బయలుదేరాను.


○ ● ○

ముందసలు హేచరీస్‌ద్వారా సీడ్ కొనాలనుకున్నాడు జగన్నాథం మావ. కాని హేచరీ వాళ్లకి అడ్వాన్సుముందే డిపాజిట్ కట్టాలి. కట్టడానికి టైము లేకపోవడం కొంత, హేచరీ పిల్లలు ఎక్కువ బ్రతకడంలేదని కొంత మొత్తంమీద అక్కడ మానుకున్నాడు.

పలాస వెళ్లాక అక్కడ దొరక్కపోతే బరంపురం వెళదామని నిశ్చయించుకున్నాం.

## మీకు తెలుసా

"ప్రపంచంలో ఏటాన్ కాలేజీ మిక్కిలి ప్రఖ్యాతి పొందిన స్కూలు. దీన్ని ఇంగ్లండు దేశపు రాజా అయిన ఆరవ హెన్రీ స్థాపించాడు. తేనెటీగకు మనిషిలాగ కండరాలు వున్నాయి. ఇది కుట్టడానికి 22 కండరాలను ఒక్కసారిగా ఉపయోగిస్తుంది. లేకపోతే కుట్టలేదు.



— శ్రీశారద

సీడ్ పట్టేవాళ్లు డైరెక్టుగా మనకి అమ్మరు. బ్రోకర్లద్వారా కొనుక్కోవాలి. ఒక్కో సీడ్‌కి పది పైసలనుంచి ఇరవై పైసలవరకూ వాళ్లు కమిషన్ తీసుకుంటారు. కమిషన్‌ద్వారా లక్షలు సంపాదించినవాళ్లున్నారు. దున్నేవాడికి పూర్తిగా పంట దక్కదన్నట్లు సీడ్ పట్టేవాళ్లకి కూడా పూర్తి రేటు దక్కదు.

ఒక బ్రోకర్‌ను పట్టుకుని రెండు లక్షల సీడ్ కావాలన్నాం. అక్కడ దొరికే సీడ్ శాంపిల్ చూపించాడు. సైజ్ బాగానే వుంది. కోనసీమలో దొరికే సీడ్‌కంటే బావుంది. రెడ్‌నుంచి కొంచెం సైజ్ తిరిగింది. బ్లాక్ కావడానికి వారం రోజులకంటే ఎక్కువ పట్టదు. రేటుమాత్రం తొంభై పైసలు పడుతుందన్నాడు. మేం డెబ్బయి పైసలు మించవదనుకున్నాం. అయితే గంట సేపు బేరమాడితే ఎనభై పైసలకు దిగాడు. ఇంత దూరం వచ్చాం కాబట్టి తప్పదనుకున్నాం. అయినా అక్కడ రూపాయి దాటిపోయింది మరి. మొత్తం రెండు లక్షలు ఒక రోజులో దొరకదు కాబట్టి మూడు రోజుల్లో సప్లయి చేస్తానన్నాడు. ముప్పది మందికి చెబితేగాని దొరకదన్నాడు. ఏం చేస్తాం. ఓ లాడ్జిలో ఓ రూము తీసుకుని మూడు రోజులు అక్కడే ఆగిపోయాం. సీడ్‌ని పాలిథీన్ సంచుల్లో తీసుకెళ్లాలి. ఒక్కో సంచిలో ఐదు వందలు చొప్పున వేసినా ఓ సుమారు నాలుగు వందల సంచులు కావాలి. ముందుగానే వాటిని కొన్నాం. అవి పెట్టుకోవడానికి అట్టపెట్టెలు కొన్నాం. ఆ పెట్టెల్ని ఇంటికి చేర్చడానికి ఓ వేన్‌ని మాట్లాడాం. రేపు సప్లయి చేస్తాననగా ముందురోజు బ్రోకర్‌కి సంచులిచ్చేశాం. అతను ముందే చెప్పాడు. "మీరు రెండు లక్షలు లెక్కపెట్టుకోవడం కష్టంకదా. మా వాళ్లు మీకు నాలుగు వందల సంచుల్లోనూ ఐదేసి వందల చొప్పున లెక్కపెట్టే కట్టి వుంచుతారు. వాటిలో మీరు ఒకటి రెండు సంచుల్ని తీసి లెక్కపెట్టుకోండి. అందులో ఎన్ని లెక్కకొస్తే మిగతా సంచులన్నీ అదే లెక్కకడతాం" అన్నాడు. ఎక్కడైనా అదే పద్ధతి కాబట్టి సరే అన్నాం.

అప్పటికే నాకు మనస్సులో తొలుస్తూనే వుంది. ఇందులో ఏమన్నా మోసం వుందేమోనని. అదే విషయం మావతో అన్నాను.

"నీదంతా భయంరా. ఏం జరుగదు. వాళ్లు రోజూ ఎంతమందికి సప్లయి చేస్తున్నారు. చూస్తున్నాంగా. అలా చేస్తే వాళ్ల బిజినెస్ ఎంతకాలం జరుగుతుంది" అన్నాడు.

మర్నాడు తెల్లవారుజామునే లాడ్జినుంచి బయలుదేరాం. వేన్ వాడికి ముందే చెప్పడంతో లాడ్జికొచ్చాడు. మేం వెళ్లేసరికి బ్రోకర్ సీడ్ రెడీ చేశాడు. మొత్తం నాలుగువందల పాకెట్లు వరుసగా పేర్చి వున్నాయి. అందులో రెండు పాకెట్లు ఏరి ఒకటి నాకిచ్చి తానొకటి తీసుకున్నాడు. ఒక్కో సంచిని సగం నీటితోనింపి అందులో సీడ్ వేసి మూతి బిగించారు. నా పాకెట్‌ని లెక్కపెట్టిస్తే అందులో ఐదు వందల పది వున్నాయి. అందులో ఎనిమిది పిల్లలు చచ్చిపోయాయి. మా మావ లెక్కపెట్టించిన పాకెట్‌లోనూ అన్నే వున్నాయి అందులో [illegible] పిల్లలు చచ్చిపోయాయి.

''అలా కొన్ని చచ్చిపోతుంటాయి. మేం ప్రతి బాగ్‌లో పది పిల్లలు ఎక్కువ వేస్తాం. అన్నీ బతికితే మీకు నాలుగు వేలు ఎక్కువ వస్తాయి. కొన్ని పోయినా మీకు రెండు లక్షలసీడ్ వుంటుంది'' చెప్పాడు బ్రోకర్.

రెండు లక్షల సీడ్‌కి లక్షా అరవై వేల రూపాయలు బ్రోకర్‌కిచ్చాడు. ఆ నాలుగు వందల సంచుల్ని పది అట్టపెట్టెల్లో సర్దించి వేన్‌లో పెట్టాం. అంత డబ్బు ఇస్తుంటే నాకు ఏదోలా అన్పించింది.


''ఇంకా కావాలంటే మీరెప్పుడైనా రండి సార్. అక్కడ మీవాళ్లకి చెప్పండి. మీరు ఇంటికి వెళ్లిన వెంటనే సీడ్ టాంకుల్లో వేసెయ్యండి. రేపు వేసేటట్లయితే ఈ పిళ్లమార్చాలి. లేకపోతే పిల్లలు చచ్చిపోతాయి'' అన్నాడు బ్రోకర్.

సరేనని బయలుదేరాం. అప్పటికి సమయం ఏడయింది.

''వైజాగ్ చేరేసరికి పది గంటలవుతుంది మనం ఇంటికి చేరడానికి సాయంత్రం ఐదవ్వచ్చు. వెంటనే టాంకుల్లో వేసేస్తే ఇంకా బాధుండదు'' అన్నాడు.

త్వరగా ఇంటికి చేరుకోవాలనే ఉద్దేశ్యంతో ఎక్కడా ఎక్కువగా ఆగకుండా ప్రయాణం చేశాం. కాకినాడలో మాత్రం ఒక అరగంట ఆగి భోజనం చేశాం. అనుకున్నట్లుగానే సాయంత్రం ఐదు గంటలకు ఇంటికి చేరుకున్నాం. అమలాపురంలో డ్రైవరు టీకి ఆగుదామన్నా ఆగనివ్వలేదు. మేం వచ్చే టైము ముందుగానే ఇంటికి టెలిగ్రాం ద్వారా తెలియపర్చడంతో మా బావలిద్దరూ టాంకుల దగ్గర పనివాళ్లతో రెడీగా వున్నారు. అట్టపెట్టెలు దించిన వెంటనే వేన్ డ్రైవర్ తన బాడుగ తీసుకుని వెళ్లిపోయాడు.

వేన్ రావడం, అట్టపెట్టెలు దించడం చూసిన చుట్టుపక్కల టాంకులవాళ్లు అక్కడకు చేరకున్నారు. మా మావ వాళ్లతో ఈ సీడ్ కొనడానికి ఎన్ని బాధలు



పడింది కథగా చెపుతున్నాడు.

మా బావలిద్దరూ ఆ సంచుల్ని విప్పి బకెట్లలో నెమ్మదిగా వంపుతున్నారు. నాలు గైదు సంచుల్ని ఒక్క బకెట్లో జాగ్రత్తగా పోస్తున్నారు.

"ఒరే ఒక బకెట్ ఇలా పట్రా" అని పనివాణ్ణి పిలిచాడు. సీడ్ వేసిన బకెట్ తెచ్చి వాళ్లముందు పెట్టాడు. అంతా చూసి బాగుందంటే బాగుందన్నారు. ఒక్కో బకెట్ తీసుకెళ్లి టాంకులో వేస్తున్నారు. ఓ పది బకెట్లు వేసింతర్వాత "నాన్నోయ్" అంటూ పిలిచాడు మా మావ పెద్దకొడుకు.

"ఏం జరిగిందిరా" కంగారుగా అడిగాడు.

"మోసం జరిగిపోయింది. అంతా మోసం" అంటూ కేకలు పెడుతున్నాడు.

"అసలేమయిందిరా"

"కొన్ని పేకెట్లలో అసలు సీడే లేదు. సీడు సైజులోనే జనపనార ముక్కలున్నాయి. సంచులు విప్పి బకెట్లలో వేస్తుంటే అవి పైకి తేలిపోయాయి" అన్నాడు.

అంతే. అక్కడంతా గోలగా తయారయింది. ఒక్కో సంచి విప్పుతుంటే ఏముంది? సీడ్ లేదు. అలాగే వున్న నానా చెత్త వుంది. మా మావ అక్కడే కూలబడిపోయాడు నోటమాటరాక. అప్పుడు జనం మొదలుపెట్టారు. అక్కడ జరిగే మోసాల గురించి. కొంత మంది దగ్గర ముందుగా డబ్బు తీసుకుని సీడ్ ఇవ్వకుండా మోసం చేస్తారని, అడ్వాన్సు తీసుకున్న వ్యక్తులు కనపడరని, అక్కడున్నవాళ్లనడిగితే చంపుతామని బెదిరిస్తారని, గతంలో వాళ్ల వాళ్లకి జరిగిన అనుభవాలను చెప్పుకొస్తున్నారు.

ఎంత మోసం జరిగిపోయింది. కళ్లముందే మోసం చేసేశారు. మొత్తం వంద పేకెట్లలోనే సీడ్ వుంది. మిగిలిన మూడు వందల పేకెట్లలో జనపనార ముక్కలు, తడప ముక్కలు వున్నాయి. అంటే రెండున్నర లక్షల సీడ్‌కి ఏభై వేల సీడ్ మాత్రమే వుంది. అంటే లక్షాపాతికవేల వరకు ఇక్కడే నష్టం వచ్చింది. కోపంతో ఊగిపోయాడు. "వెధవలు వన్నే మోసం చేస్తారా. వాళ్ల అంతు చూస్తాను" అంటూ చిందులు వేశాడు. నేను నచ్చచెప్పాను. వెళ్లి లాభం లేదని, వెళితే ప్రమాదమేతప్ప పని జరగదని. అందరూ నేను చెప్పినదాన్నే సమర్థించారు.

అక్కడనుండి తెచ్చిన సీడ్‌ని ఒక టాంకులో వేయించారు కొడుకులిద్దరూ. మిగిలిన మూడు టాంకుల్లోనూ తమకవసరమైన లక్ష సీడ్ లోకల్‌గానే కొనాలనుకున్నారు. నాలుగు రోజులపాటు మా జగన్నాథం మావ మంచం దిగలేదు. కొడుకులిద్దరూ సీడ్ కొని టాంకుల్లో వేశారు. మరో లక్ష ఖర్చయింది. అవి తయారయ్యేలోగా చెరువుల్లోకి నీరు తోడించారు. రెండు కుటుంబాలు వుండడానికి పాకలు వేయించారు. ఫీడ్ పెట్టుకోవడానికి ఓ స్టోర్‌రూమ్ కట్టించారు. చెరువుల దగ్గరకు అవసరమైన పంజామా చేర్చారు.

○ ● ○

మా ఊరంతా హడావిడిగా వుంది. ఆ రోజే రొయ్యపిల్లలను సీడ్ టాంకుల్లోనుంచి పట్టి పెద్ద చెరువుల్లో వేస్తారు. వాటిని పట్టడానికి జాలర్లను పిలిపించారు. ప్రతీ

టాంకు దగ్గరా హడావిడే. మా జగన్నాథం మావ అయితే మరీను. ఊరికే హడావిడి పడిపోతున్నాడు. ఈ పిల్లలను పట్టుకెళ్లడానికి కేన్స్ సంపాదించాడు. ట్రాక్టరు పెట్టేడు ఒక్కో చెరువులో ఎన్ని, ఎలా వెయ్యాలో పనివాళ్లకి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాడు.

రొయ్య పిల్లలను పడుతున్నారుకదా చూద్దామని వేనూ వెళ్లాను. నే వెళ్లేసరికి నెలాసనుంచి తెచ్చిన సీడ్ వేసిన టాంక్ పడుతున్నారు. సీడ్ బాగానే తయారయింది బాగా బ్లాక్ తిరిగింది. రెండు గంటలపాటు పట్టేసరికి ఆ టాంకులో ఇరవై వేల పిల్లలు దొరికాయి. మిగిలినవి చెరువుల్లో వెయ్యడానికి పనికిరావు. చెరువుల్లో వెయ్యడానికి టైగర్ ప్రాన్ పిల్లలు కావాలి. అవీ ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ. అన్ని రకాల రొయ్య సీడ్ ఒకలాగే వుంటుంది. అందులో టైగర్ ప్రాన్ సీడ్ గుర్తించడం కష్టం. ఎంతో అనుభవమున్నవాళ్లు, ఎక్స్‌పర్ట్స్ అయితే తప్ప గుర్తించలేరు. లోకల్‌గా కొనివేసిన టాంకుల్లోకూడా సరిగ్గా కాలేదు. మొత్తం మీద ఎనభై వేల పిల్లలు దొరికాయి. అంటే డెబ్బయివేల పిల్లలు పనికిరాలేదు. అందులో కొన్ని చచ్చిపోవడం, మిగిలినవి టైగర్ కాకపోవడం జరిగింది.

మా మావే కాదు. మిగిలినవాళ్లంతాకూడా ఇలాగే నష్టపోయారు. ఎంతో ఆశగా లక్షలకు లక్షలు సంపాదించాలనుకున్నవారంతా బాగా నష్టపోయారు. సగానికి సగంకూడా రాలేదు.

మా వూళ్లో వున్న చెరువులకు కావలసిన పిల్లల్ని మా వూళ్లో వున్న సీడ్ టాంకులవాళ్లు వేసింది సరిపోయేది. కాని ఈసారి అవి సరిగా రాకపోవడంతో చెరువుల్లోకి కొరత ఏర్పడింది. మా మావ మరో డెబ్భై వేల టైగర్ ప్రాన్ పిల్లల్ని రెండు లక్షలుపెట్టి యానాంనుంచి కొనుక్కువచ్చాడు. మొత్తం రొయ్యపిల్లలకోసం ఐదు లక్షలు ఖర్చుపెట్టా


## మూడొచ్చింది

"మాస్టారూ! నాకు మూడొచ్చింది అంది పదవతరగతి పద్మ లెక్క లేసి...

"మాస్టారూ నాకూ మూడొచ్చింది" అన్నాడు అదే క్లాసులో అనంత్.

"మీ ఇద్దరికీ మూడొస్తేసరిపోతుందా! నాకు రావద్దు! నాకూ మూడొస్తేనే లెక్క కరెక్టు" అన్నాడు టీచర్ కోపంగా.

— గీతా శ్రీనివాస్ (గండిపాలెం)



డు. మామూలుగా అయితే తనకు కావలసిన లక్షాఎనభైవేల పిల్లలకు మూడు లక్షలయ్యేం దేది. కాని రెండులక్షలు ఇక్కడ మిగుల్చుకో వాలనుకుంటే మరో రెండులక్షలు చేతివి తగిలాయి.

మా మావేకాదు. వూళ్లో చాలామందికి ఇటువంటి పరిస్థితే ఏర్పడింది.

○ ● ○

వెలరోజులు గడిచాయి.

మా జగన్నాథం మావ, పిల్లలు చాలా బిజీగా వుంటున్నారు. కొబ్బరితోట అమ్మ గా వచ్చిన డబ్బంతా ఫీడ్‌కే సరిపోయింది. ఇతర్రతా ఖర్చులు అంటే ఆయిలు, జీతాలు మొదలైన వాటికి చిల్లరమల్లగా అప్పులు చేయవలసి వస్తుంది. ఓరోజు మా మావ మా ఇంటికొచ్చాడు.

''చెరువులు వేసి పొరపాటు చేశావనిపిస్తు ందిరా'' అన్నాడు.

''అదేం'' అన్నాను.

ఎంత డబ్బు తెచ్చినా సరిపోవడంలేదు. విన్ననే ఫీడ్ కంపెనీనుంచి ఉత్తరం వచ్చింది. ఇప్పటివరకు వాళ్లు నకు లక్ష రూపాయల ఫీడ్ సప్లయి చేశారు. ఇంకా రెండు నెలలు గడవాలిగా. ఇంకా రెండు లక్షల రూపాయల ఫీడ్ అవసరమవుతుంది. వాళ్ల కంపెనీ నష్టాల్లో వుందట. మూడు లక్షలు అప్పు పెట్టడం వీలుకాదట. లక్ష కట్టేస్తే మిగతా ఫీడ్ సప్లయి చేస్తారట. వడ్డీకి వడ్డీలు తీసుకుంటూ మధ్యలో అలా అంటే ఎలా? అందుకే అక్కడ క్లియర్ చేసేసి డబ్బెట్టి కొనుక్కుంటే మంచిదనిపిస్తుంది'' అన్నా డు.

''ఇప్పుడంత డబ్బెక్కడిది?'' అనడిగా ను.

''వాడగ్గరెక్కడుంది. కొబ్బరితోట అ మ్మగా వచ్చిందంతా పిల్లలకే సరిపోయింది. అందుకే అప్పు చేద్దామనుకుంటున్నాను. కోపరేటివ్ లోను ఎలాగూ రాదు. తనఖా బ్యాంకులోగాని, ఇతర బ్యాంకుల్లోగాని పదెకరా లు తనఖా పెడదామనుకుంటున్నాను. మూ డు నాలుగు లక్షలిస్తారు'' అన్నాడు.

మా మావ ఎంత లోతుగా కూరుకుపో తున్నాడో అనిపించింది.

''తనఖా పెట్టడం అంత మంచిది కాదేమో మామా'' అన్నాను.

''మరోదారిలేదురా. వందలూ, వేలూ కాదు. లక్షలు కావాలి. ఎవరిస్తారు. అప్పుడు నువ్వు చెప్పినట్లు సగం లీజుకిచ్చి మిగిలింది చేసుకుంటే ఇంత బాధుండేదికాదు. కాని ఇప్పుడేం చేయలేంగా. మధ్యలో ఆపలేం. దీన్ని పూర్తిచేయాల్సిందే. అయినా ఏమయిం దిలే రేపు ఆదాయం వచ్చినప్పుడు తీర్చేద్దాం'' ధీమాగానే అన్నాడు.

నేనేం మాట్లాడలేకపోయాను.

మా వూళ్లో అందరి పరిస్థితి దాదాపు అలాగే వుంది. ప్రారంభంలో వున్నఉత్సాహ ం లేదు. గతంలో సంపాదించినవాళ్లను చూసి అందరూ ముందుకురికారు. దిగింత ర్వాత తెలిసిందందరికి. అయినా ఏం చేస్తారు . మింగలేక కక్కలేక చస్తున్నారు. డబ్బంతా గంగలో పోశారు. మునుగుతుందో తేలుతుం దో ఎవరికీ తెలియదు.

అన్నట్లుగానే మా జగన్నాథం మావ భూమి తనఖా పెట్టి మూడు లక్షలు అప్పు

తెచ్చాడట. ఏమైనా తారుమారైతే అతని పరిస్థితేమిటని ప్రశ్నించుకుంటే నాకు సమాధానం దొరకలేదు.

○ ● ○

రోజులు సాఫీగా జరిగిపోతున్నాయి. రొయ్యల చెరువులు తవ్వించినవాళ్లంతా చాలా బిజీగా వుంటున్నారు. ఇరవై నాలుగు గంటలు వాటిమీదే దృష్టిని కేంద్రీకరించాలి. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా పరిస్థితి తారుమారైపోతుంది. టైము ప్రకారం వాటికి ఫీడ్ వెయ్యాలి. ఆక్సిజన్ అందేవిధంగా నీటిని ఎప్పటికప్పుడు మారుస్తూ వుండాలి. పూర్తిగా పనివాళ్లమీదే ఆధారపడకుండా చూసుకోవాలి. దొంగతనాలు జరుగకుండా రాత్రీ పగలూ కాపలా కాయాలి. ఎవరైనా కేజీ రొయ్యలు దొంగిలిస్తే ఐదు వందల రూపాయలు పోయినట్టే. అందుకే మా బావలిద్దరూ చెరువులదగ్గరే వుంటున్నారు.

ఓరోజు అందరి ముఖాల్లోనూ భయం చోటుచేసుకుంది. వాటర్‌లో తేడా వచ్చిందో లేక ఫీడ్‌లో తేడా వచ్చిందో గాని నీటిలో ఫంగస్ చేరింది. రొయ్యలేమవుతాయోనని భయపడిపోయారు. కాని వాళ్లు భయపడిన ట్లేమీ జరుగలేదు. ఫంగస్‌ను నెమ్మదిగా తీసేసి నీటిని పూర్తిగా మార్చి మొత్తంమీద ఫర్వాలేదనిపించుకున్నారు.


మా మావ వచ్చే ప్రతిఫలంకోసం ఆశగా ఎదురుచూస్తున్నాడు.

పదెకరాల్లోనూ అన్ని ఖర్చులు పోను పది లక్షలు వస్తాయని, అప్పులు తీర్చేస్తే, ఐదు లక్షలు చేతిలో వుంటాయని, దాంతో రెండు క్రాపుకి పెట్టుబడి పెట్టొచ్చని, ఆ తర్వాత వచ్చేదంతా లాభమేనని చాలా ఆశపడుతున్నాడు.

అంతా అదే భావంతో ఎదురుచూస్తున్నారు. శాయశక్తులా కష్టపడుతున్నారు.

ఇంక పదిరోజుల్లో ఫలితం అందబోతుందని ఆనందపడుతున్నారంతా.

## వింతలు



"జె.బి.వాన్ హెల్ మోంట్ అనే డచ్ శాస్త్రజ్ఞుడు గాస్ అనే పదాన్ని సృష్టించాడు. దీనికి కెయాస్ అనే గ్రీకు పదం ఆధారం. ఇది మొట్టమొదట 1624లో వాడబడింది. పశ్చిమ ఆసియా సిరియాలోని డెమాస్కస్‌లో అబెల్ సమాధి ప్రపంచంలో మిక్కిలి ప్రాచీనమైనది. ప్రతిఏడూ వేలాదిమంది భక్తులు దీన్ని సందర్శిస్తారు.

— డి. సత్యమూర్తి

అనుకున్నవన్నీ జరిగితే అది జీవితమెం
దుకవుతుంది. అందరి అంచనాలు తారు
మారుచేస్తూ రొయ్యలకు క్రొత్తరకం జబ్బు
లొచ్చి చచ్చిపోయి పైకి తేలిపోతున్నాయి.
వాటికి సంబంధించిన సలహాదార్లకు కూడా
అంతుబట్టని జబ్బురావడంతో మా మావ
వేసిన పదెకరాల్లోనూ రొయ్యలు చచ్చిపోయి
నీటిపైకి తేలిపోయాయి.

ఈ విషయం తెలిసిన మా జగన్నాథం
మావకు హార్ట్ అటాక్ వచ్చింది. మైల్డ్
స్ట్రోక్ కావడంతో ప్రాణాపాయం జరుగలేదు
. డాక్టర్ మాత్రం ఇంకోసారొస్తే బ్రతకడని
చెప్పేశాడు. ఆ కుటుంబమంతా బెంగతో
మంచం పట్టేశారు. అప్పులెలా తీర్చాలో
వాళ్లకి అర్థం కావడంలేదు. బంగారంలాంటి
కొబ్బరితోట చేతులారా లేకుండా చేసుకు
న్నారు. వెలవెలా వచ్చే ఆదాయం పోయింది.
మిగిలిన భూమంతా తనఖా పెట్టారు. అది
తీర్చకపోతే ఆ భూమికూడా లేకుండా
పోతుంది. మా మావ పూర్తిగా లేకుండా
మంచంమీదే పడి వుంటున్నాడు. ఒకసారి
వెళ్లి మా మావతో అన్నాను.

''జరిగిందేదో జరిగిపోయింది. ఇలా
జరుగుతుందని మాత్రం ఎవరూ ఊహించ
లేదుకదా. ఈ సంవత్సరం ఇంక మీరు వాటి
జోలికెళ్లకండి. ఆ పదెకరాలు లీజుకిచ్చెయ్యం
డి. ఆ డబ్బుతో అప్పు తీర్చెయ్యండి. వేరే
ఎక్కడైనా నాలుగైదు ఎకరాలు మాగాణి
కవులుకు తీసుకుని వరి పండించుకుంటే
బాగుంటుంది. కొంత కాలానికి పరిస్థితులు
చక్కపడకపోవు'' అని.

మా మావను చూసి అయినా ఇతరులు
బుద్ధి తెచ్చుకుంటే మంచిది. ఏదో సంపాది
ంచేయాలనే తాపత్రయంతో ఉన్నవన్నీ
అమ్ముకుని బికార్లయిపోయినవాళ్లు చాలామం
ది వున్నారు మావూళ్లో. అంతా అలా
అయ్యారని కాదు. పీటిమీద లక్షలు, కోట్లు
సంపాదించినవాళ్లూ వున్నారు. ప్రతీవాళ్లూ
నష్టపోయినవాళ్లను పట్టించుకోకుండా బాగా
సంపాదించినవాళ్లను ఆదర్శంగా తీసుకోవడ
ంతో ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుంది.
మరి ఇలా ఎంతకాలం కొనసాగుతుందో
తెలీదు.

మా మావలాంటి వాళ్లని నిస్సహాయులు
గా వదిలేసి కోనసీమ పరుగులు పెడుతూనే
వుంది. ●

